

గార్ల మండలం ముల్కనూరులో టెంట్ హౌజ్ నుంచి కట్టుకాలువలకు వెళ్లే రహదారి 1.20 కిలోమీటర్లకు రూ. 65 లక్షలు మంజూరయ్యాయి. ఇన్నాళ్లు రహదారి బాగా లేకపోవడంతో రైతులు, ప్రజలు ఇబ్బందులకు గురయ్యే వారు. రోడ్డు నిర్మించడం ద్వారా ముల్కనూరు ప్రజలకు రహదారి సౌకర్యం సులువుగా మారనుంది.



కురవి మండలం నేరడ - పర్వతగిరి మధ్య 2.50 కి.మీ.,కు రూ. 3.62 కోట్లు మంజూరయ్యాయి. రహదారి సరిగా లేక ముప్పై ఏళ్లుగా రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రహదారి నిర్మాణంతో రైతులకు మేలు చేకూరనుంది. మహబూబాబాద్‌కు వెళ్లే వాహనదారులకు దూరం తగ్గనుంది.

గ్రామీణ రహదారులకు మహర్దశ

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: జిల్లాలోని పలు మండలాల్లో గ్రామీణ రహదారుల నిర్మాణానికి పంచాయతీ రాజ్ శాఖ నిధులను మంజూరు చేసింది. గ్రామాల్లో రహదారులు అధ్వానంగా మారడంతో కొన్నేళ్లుగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రహదారుల నిర్మాణాలకు పంచాయతీ రాజ్‌శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపించగా రాష్ట్ర ప్రభుత్వం వాటిని ఆమోదించింది. జిల్లాలోని కేసముద్రం, బయ్యారం, గార్ల, పెద్దవంగర, తొర్రూరు. డోర్నకల్, కురవి, గంగారం, కొత్తగూడ మండలాల్లోని వివిధ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణాలు చేపట్టనున్నారు. గంగారం, కొత్తగూడ మండలాల్లో ఐదు పనులకు నిధులు మంజూరు చేశారు. పనులను ఇంకా గుర్తించలేదు. జిల్లాలో 42. కిలోమీటర్ల మేర పొడవులో జరిగే నిర్మాణాలకు రూ.56.23 కోట్లు కేటాయించారు. దీంతో గ్రామీణ, పట్టణ ప్రజలకు ప్రయోజనం చేకూరనుంది.

మండలాలవారీగా మంజూరు ఇలా

మండలం	పనుల సంఖ్య	కి.మీ	నిధులు (రూ.కోట్లలో)
కేసముద్రం	09	18.8	19,93
బయ్యారం	02	4.80	4.80
గార్ల	01	1.20	0.65
పెద్దవంగర	01	3.75	3.95
తొర్రూరు	01	1.75	1.90
డోర్నకల్	02	3.70	4.82
కురవి	03	8.50	10,18
గంగారం	03	గుర్తించలేదు	6,00
కొత్తగూడ	02	గుర్తించలేదు	4.00

గ్రామీణ రోడ్లకు మరిన్ని నిధులు - మంత్రి సీతక్క

ములుగు, న్యూస్‌టుడే: గ్రామీణ రోడ్లకు మరిన్ని నిధులు కేటాయించేందుకు ఇప్పటికే ప్రతిపాదనలు చేశాం. క్యాబినెట్‌లో తీర్మానం చేసి ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే రూ.1,377 కోట్ల నిధులు విడుదల చేశాం. గతంలో పనులు ప్రారంభించి మధ్యలో వదిలేసిన వాటికి సంబంధించిన బిల్లులను కొద్దికొద్దిగా చెల్లిస్తున్నాం. గత ప్రభుత్వం రూ.40 వేల కోట్ల బిల్లులు పెండింగ్ పెట్టడంతో.. పనులు సరిగా జరగలేదు. అలాంటి వాటిని గుర్తించి గుత్తేదార్లకు నోటీసులు జారీ చేస్తున్నాం. అదే గుత్తేదారు పని చేస్తారా? రద్దు చేసి వేరే వారితో చేయించాలా? అనే దానిపై వివరణ అడుగుతున్నాం. పనులు చేయలేమన్న వారికి సంబంధించిన పనులను రద్దు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. ముందుకొస్తున్న వారికి కొన్ని బిల్లులు కూడా చెల్లిస్తాం.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

కొత్తగూడ, న్యూస్‌టుడే: ప్రభుత్వ బడుల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య అందిస్తున్నామని పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. శుక్రవారం కొత్తగూడ మండలంలోని పొగుళ్లపల్లి, ఎదుళ్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలకు మౌరిటెక్ సంస్థ సహకారంతో నెలకొల్పిన కంప్యూటర్ ల్యాబ్‌లను మంత్రి ప్రారంభించారు. ఆయా పాఠశాలల ఆవరణలో నిర్వహించిన సమావేశాల్లో ఆమె మాట్లాడారు. సాంకేతిక రంగాల్లో ఏజెన్సీ విద్యార్థులు కూడా రాణించేందుకు ప్రత్యేకంగా ఆయా పాఠశాలల్లో కంప్యూటర్లు ఏర్పాటు చేయించినట్లు చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు వినియోగించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థులు చదువుతోపాటు మొక్కలను పెంచుతూ కాపాడాలని చెప్పారు. ఇటీవల ప్రారంభించిన ఏకలవ్య గురుకులాన్ని సందర్శించి పరిశీలించి చిన్నచిన్న పనులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని సిబ్బందికి సూచించారు. మొండ్రాయిగూడెం, ఎదుళ్లపల్లి గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా, మహబూబాబాద్ అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సవ్ టొప్పొ, డీఈవో రాజేశ్వర్, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో రవీంద్రప్రసాద్, ఎంఈవో లక్ష్మీనారాయణ, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు విష్ణువర్ధన్‌రావు, లక్ష్మీనారాయణ, డీఎస్పీ తిరుపతిరావు, సీఐ బాబురావు, కొత్తగూడ, గంగారం ఎస్‌ఐలు కుశకుమార్, రవికుమార్, మాజీ ప్రజాప్రతినిధులు విజయ, పుష్పలత, పలువురు నాయకులున్నారు.



పొగుళ్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ల్యాబ్‌లో కంప్యూటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కల్యాణలక్ష్మీ చెక్కులను శుక్రవారం మంత్రి సీతక్క పొగుళ్లపల్లిలో 15 మంది లబ్ధిదారులకు ఈ చెక్కులను పంపిణీ చేశారు. తహసీల్దార్ రమాదేవి, రెవెన్యూ సిబ్బంది సాంబయ్య, లబ్ధిదారులున్నారు.

బాధ్యతతో విధులు నిర్వహించాలి

కురవి, న్యూస్‌టుడే: పోలీసు అధికారులు, సిబ్బంది బాధ్యతతో విధులు నిర్వహించి ప్రజలకు ఉత్తమ సేవలను అందించాలని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. శుక్రవారం ఆయన కురవి ఠాణాను తనిఖీ చేశారు. పీఎస్‌లోని రిజిస్టర్లు, ఆయుధాలు, పరిసరాలను పరిశీలించారు. కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ 100 డయల్ కాల్ చేసిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. నిఘా పెంచాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో స్నేహపూర్వకంగా ఉండి వారికి న్యాయం జరిగేలా చూడాలన్నారు. కళాజాతలు నిర్వహించి రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, నూతన, చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా ప్రజలను చైతన్యం చేయాలని ఎస్పీ సూచించారు. రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.



కురవి ఠాణాలో సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

‘ముడా’ ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ


మహబూబాబాద్, న్యూస్‌టుడే: ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి, మౌలిక వసతులు కల్పించేందుకు జిల్లాలోని నాలుగు పురపాలక సంఘాలు, ఏజెన్సీ మండలాలు మినహా మిగిలిన 13 మండలాల పరిధిలోని 159 గ్రామాలను కలుపుతూ మహబూబాబాద్ పట్టణ అభివృద్ధి సంస్థ(ముడా) ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.దానకిశోర్ నోటిఫికేషన్ ఉత్తర్వులు జారీ చేశారు. పట్టణీకరణలో భాగంగా ప్రధాన పట్టణాలతో పాటు పంచాయతీలను కూడా అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ఈ సంస్థ ప్రణాళికలను రూపొందించనుంది. నిర్మాణాత్మక పట్టణ అభివృద్ధి కోసం జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) వైస్‌ఛైర్మన్‌గా, ముగ్గురు సభ్యులుగా రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులను నియమించనున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బడుల బలోపేతానికి కృషి

మహబూబాబాద్ రూరల్, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. శుక్రవారం పట్టణ శివారు ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. ప్రభుత్వ విద్యను ప్రోత్సహిస్తూ 11 వేలపై చిలుకు ఉపాధ్యాయులను భర్తీ చేసిన ఘనత కాంగ్రెస్‌కు దక్కుతుందన్నారు. ఎమ్మెల్యేను ఉపాధ్యాయులు సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు సోమ గోవర్ధన్, ఉపాధ్యాయులున్నారు.

దూది రైతుకు దుఃఖమే మిగిలింది!

ఈనాడు, వరంగల్, మహబూబాబాద్
ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే



రైతు ఆశాజీవి.. ఎప్పటికైనా గిట్టుబాటు ధర రాకపోతుందా అని ఆరుగాలం కష్టించి పంట పండిస్తే చివరికి కన్నీరే మిగులుతోంది. ఈసారి అకాల వర్షాలు, చీడపీడల కారణంగా.. ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదు. దానికితోడు పండించిన పంటకు గిట్టుబాటు ధర రావడం లేదు. మార్కెట్‌లో దళారులు, అధికారులు కుమ్మక్కై ధర తగ్గించి రైతును నిలువునా ముంచుతున్నారు.. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పత్తిని అధికంగా పండించే అన్నదాతల పరిస్థితి ఇప్పుడు అగమ్యగోచరంగా మారింది.

● రాష్ట్రంలోనే పెద్దదైన వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు ఉమ్మడి వరంగల్‌వ్యాప్తంగా రైతులు పత్తిని అమ్మకానికి తీసుకొస్తారు. శుక్రవారం ధర పడిపోవడంతో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు ఆందోళన నిర్వహించారు. పోలీసులు రంగప్రవేశం చేసి రైతులు, రైతు సంఘాలు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, మార్కెట్ అధికారులతో చర్చించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని మార్కెట్ కార్యదర్శి రైతు సంఘాల నాయకులకు భరోసానివ్వడంతో.. ఆందోళన సద్దుమణిగింది. ఎలాంటి షరతులు లేకుండా సీసీఐ కొనుగోళ్లు చేపట్టాలని, మద్దతు ధర రూ.11 వేలకు పెంచాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

సీసీఐ ప్రేక్షక పాత్ర..

వ్యాపారుల చేతుల్లో రైతులు నిలువునా మోసపోతున్నా.. భారత పత్తి సంస్థ ప్రేక్షక పాత్ర పోషిస్తోంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో పత్తిలో 8 నుంచి 12 తేమ శాతం రాదని తెలిసినా.. తేమశాతాన్ని పెంచేందుకు సీసీఐ నిబంధనలు ఒప్పుకోవని అధికారులు చేతులెత్తేశారు. దాంతో వ్యాపారులు రైతుల కష్టాన్ని అగ్గువకే దోచుకుంటున్నారు. మరోవైపు గ్రామాల్లోనూ దళారులు అక్రమంగా పత్తి కొనుగోళ్లు చేస్తూ.. తిరిగి మార్కెట్‌లో అదే పత్తిని ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు.



వేలం పాట నిర్వహిస్తున్న మార్కెట్ సిబ్బంది

మార్కెట్‌లో ‘మద్దతు’ కరవు

రూ.10 వేలకు అమ్మినా ఏమీ మిగలవు

- అడ్డాల కిషన్‌రావు, రైతు, రేవల్లె, దుగ్గొండి



నాకున్న రెండెకరాల్లో పత్తి వేశాను. శుక్రవారం 8 క్వింటాళ్ల వరకు పత్తి తీసుకువస్తే క్వింటాకు రూ.6600 చెల్లించారు. ఎకరా పత్తి తీయిస్తేనే రూ.4 వేల వరకు ఖర్చయింది. నాలుగుసార్లు పురుగుమందులు, ఇతరత్రా ఖర్చులు కలిపి చాలా ఖర్చయింది. క్వింటా పత్తి రూ.10 వేలకు అమ్మినా మాకు ఏమీ మిగలవు.

రవాణాకే రూ.5 వేలు చెల్లించాను

- రౌతు రాజయ్య, రైతు, కుంటపల్లి, సంగెం



మూడెకరాల్లో పత్తి వేస్తే తొలి కాపులో 15 క్వింటాళ్ల వరకు వచ్చింది. మార్కెట్‌కు తేవడానికి రూ.5 వేలు ఖర్చయింది. కూలీలు రూ.500 ఇస్తేగానీ రావడం లేదు. ఇక్కడ రూ.6500 కంటే తక్కువకే అడుగుతున్నారు. గతేడాది రూ.7 వేలకు పైగా ధర వచ్చింది.


రైతుల ఇబ్బందులపై వివరణ కోరగా
● పత్తి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ సీసీఐ కనీస తేమ 15 నుంచి 20 శాతానికి పెంచాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశామని అన్నారు.
● ఎనుమాముల మార్కెట్ కార్యదర్శి పి.నిర్మల మాట్లాడుతూ వ్యాపారులు తక్కువ ధరకు రైతుల నుంచి సరకును కొనకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

పంటను దున్నేస్తున్నారు...!

గత ఆగస్టు, సెప్టెంబరులో కురిసిన భారీ వర్షాల ప్రభావం పత్తి రైతులను వెంటాడుతోంది. భారీ వర్షాల సమయంలో పత్తి పూత, పిందె రాలిపోయి తెగుళ్ల బారిన పడింది. చివరి ప్రయత్నంగా పురుగు మందులను పిచికారీ చేసినా ఫలితం లేకపోయింది.



● నర్సింహులపేట మండలం జగ్గుతండా గ్రామశివారు చింతలతండాకు చెందిన రైతు బానోతు బాలాజీ మూడున్నర ఎకరాల్లో పత్తి వేశారు. రూ.లక్ష వరకు పెట్టుబడి వ్యయం చేయగా భారీ వర్షాలతో పూత, పిందెలు రాలిపోయాయి. ఎరువుల దుకాణదారుల సూచన మేరకు పలు రకాల పురుగు మందులు పిచికారీ చేసినా ఫలితం కానరాలేదు. పది క్వింటాళ్ల పత్తి మాత్రమే దిగుబడి వచ్చింది. పంటకు గులాబీ పురుగు ఆశించడంతో శుక్రవారం ట్రాక్టర్‌తో దున్నించి తొలగించారు.



● గోపాతండాకు చెందిన తాజా మాజీ సర్పంచి అజ్మీర లక్ష్మి రూ.60 వేలు వెచ్చించి రెండెకరాల్లో పత్తి సాగు చేశారు. భారీ వర్షాలకు పంట పూత, పిందెలు రాలిపోయి పెరుగుదల నిలిచిపోయింది. పురుగు మందులు వాడినా ఆరు క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. తెగుళ్లు, వానరాల నుంచి కాపాడుకోలేక పంటను పశువులకు మేతకు వదిలేశారు..

–న్యూస్‌టుడే, నర్సింహులపేట

జిల్లాల వారీగా..	వరంగల్	జనగామ	భూపాలపల్లి	మహబూబాబాద్	హనుమకొండ	ములుగు
● ఎకరాలు	1,19,910	1,16,000	93,460	79,632	77,330	20,740
● పత్తి దిగుబడి అంచనా (ఎకరానికి 6 క్వింటాళ్ల చొప్పున)	7,19,460	6,96,000	5,60,760	4,77,792	4,63,980	1,24,441

మంత్రి సురేఖ సైకిల్ సవారీ

రామన్నపేట, కాశీబుగ్గ, న్యూస్‌టుడే: రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ విద్యార్థి దశ రోజులు గుర్తు చేసుకున్నారు. శుక్రవారం సాయంత్రం వరంగల్ ఓసిటీలోని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఆంధ్రా బాలిక ఉన్నత పాఠశాలకు చెందిన కొందరు విద్యార్థినులకు మంత్రి సురేఖ చేతుల మీదుగా కాంగ్రెస్ నాయకుడు మడిపెల్లి కృష్ణగౌడ్ సైకిళ్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా మంత్రి విద్యార్థినులతో కలిసి క్యాంపు కార్యాలయం వద్ద సైకిల్ తొక్కి సందడి చేశారు. విద్యార్థినులతో స్వీయ చిత్రాలు దిగారు.



ఓర్వలేకనే ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు

తొర్రూరు, న్యూస్‌టుడే: పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధి ఆరంభం మాత్రమేనని, భవిష్యత్తులో ఎంతో ఉంటుందని, ఎవరు ఎన్ని చిల్లర రాజకీయాలు చేసిన అభివృద్ధి చేసి చూపిస్తామని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి తెలిపారు. తొర్రూరు డివిజన్ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో పాలకుర్తిని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి సీఆర్ఆర్ నుంచి రూ.22 కోట్లు, తొర్రూరు మున్సిపాలిటీ అభివృద్ధికి టీయూఎఫ్ఐడీసీ నిధుల కింద రూ.5 కోట్లు మంజూరయ్యాయన్నారు. ప్రతిపక్ష పార్టీ నాయకులు ఓర్వలేకనే అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో టీపీసీసీ మాజీ సభ్యుడు నిరంజన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ మండల, పట్టణాధ్యక్షులు సంతోష్, సోమరాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం..

తొర్రూరు: మండలంలోని వెలికట్టలో మన్నెం పద్మయ్య- సైదమ్మ దంపతుల పెంకుటిల్లు శుక్రవారం ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై, సామగ్రి కాలి బూడిదయ్యాయి. ఫైర్ సిబ్బంది వచ్చినా ప్రయోజనం లేకుండా పోయింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కందగిరి.. అభివృద్ధి జాడేది?

కురవి, న్యూస్‌టుడే: ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా కందగిరి అభివృద్ధి జాడ కనిపించడం లేదు. జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీలక్ష్మీనరసింహస్వామి, వేంకటేశ్వరస్వామి జాతరకు ఏటా వేలాది భక్తులు హాజరవుతారు. కురవి మండలం కందికొండ శివారు కందగిరి కొండపై ప్రాచీన కాలం నాటి కట్టడాలున్నాయి. ఈ జాతర ఏటా కార్తిక పౌర్ణమి రోజు కనులపండువగా సాగుతుంది. రెండున్నర కిలోమీటర్ల ఎత్తులో శిఖంపై కొలువైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఉంది. గుట్ట చుట్టూ పచ్చని చెట్లతో వెదరు పొదలతో ఆహ్లాదకరంగా ఉంటుంది. తెలంగాణ ఉద్యమ సమయంలో కేటీఆర్ కొండపై కొలువైన స్వామిని దర్శించుకున్నారు. తెలంగాణ ఏర్పడితే మెట్లు నిర్మిస్తామన్న ఇచ్చిన హామీ మేరకు 2019లో మెట్ల నిర్మాణం కోసం రూ.కోటి మంజూరు చేశారు. అదే ఏడాది నవంబరు పదోతేదీన అప్పట్లో ఎమ్మెల్యేగా రెడ్యానాయక్ పనులకు శంకుస్థాపన చేశారు. అటవీ శాఖ అధికారులు అభ్యంతరం చెప్పడంతో నిలిచిపోయాయి. నాలుగేళ్లుగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మారింది.



కొండపైకి వెళ్లడం కోసం పనులు చేసి వదిలేసిన తీరు..

బండరాళ్లే మెట్లు

జాతరకు జిల్లాలోని గ్రామాలతో పాటు ఖమ్మం, వరంగల్, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట జిల్లాల నుంచి భక్తులు తరలొస్తారు. మెట్లు లేనప్పటికీ బండరాళ్లను దాటుతూ వెళ్లి దర్శించుకుంటున్నారు. ప్రతి శనివారం దూర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి గుట్ట కింది భాగంలో ఆలయంలో పూజలు చేసి వెళతారు.



కొండపైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం

కాకతీయుల కాలం నాటి రాతి కోట, ధర్వాజులు, కోనేరు ఉన్నాయి.

15న కందగిరి జాతర

కందగిరి కొండపై నవంబరు 15న జాతర జరగనుంది. అయ్యగారిపల్లి వైపు నుంచి, కందికొండ రోడ్డు నుంచి గుట్ట వరకు రోడ్ల నిర్మాణ పనులకు నిధులు మంజూరయ్యాయి. పనులు ప్రారంభించి ఏడాది గడిచినా పూర్తి కాలేదు. వర్షాలు బాగా కురిసి వరదలతో గుట్ట సమీపంలో కోతకు గురై గుంతలు ఏర్పడ్డాయి. జాతర సమీపిస్తున్న నేపథ్యంలో అధికారులు పరిశీలించి భక్తులకు ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేయాలని భక్తులు కోరుతున్నారు.



తెదేపా కార్యకర్తలను ఆదుకోవాలని వినతి

మహబూబాబాద్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో పార్టీనే నమ్ముకొని పని చేస్తున్న నాయకులు, కార్యకర్తలను ఆదుకోవాలని కోరడంతోపాటు పలు సమస్యలపై శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెదేపా జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడిని కలిసి వివరించినట్లు తెదేపా పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు కె.రామచందర్‌రావు తెలిపారు. పార్లమెంట్ పరిధిలోని వివిధ గ్రామాల్లో రహదారి ప్రమాదాల్లో మృతి చెందిన కుటుంబ సభ్యులతో పాటు అనారోగ్యంతో మరణించినవారి కుటుంబాలకు పార్టీ పరంగా అవసరమైన సాయాన్ని అందించాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు ప్రేమ్‌చంద్‌వ్యాస్, సుతారపు వెంకటనారాయణ, పుల్లయ్య, అర్జున్‌నాయక్, నెహ్రూనాయక్ ఉన్నారు.

వంతెన కూలింది.. కాలినడకే దిక్కైంది!



ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలకు రాకపోకలు మెరుగుపర్చేందుకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం గర్మిళ్లపల్లి- పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడు గ్రామాల మధ్యలోని మానేరు వాగుపై నిర్మిస్తున్న వంతెన పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. నిర్మాణ పనులు జరుగుతుండగానే ఈ ఏడాది ఏప్రిల్, జులైలో రెండుసార్లు వంతెన గడ్డర్లు కూలిపోయాయి. 2016లో రూ.51.60 కోట్లు మంజూరు కాగా.. అప్పటి నుంచి పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ క్రమంలో గాలి దుమారానికి ఏప్రిల్‌లో 2-3 పియర్ల మధ్యలో మూడు గడ్డర్లు, జులో 17-18 పియర్ల మధ్యలో 5 గడ్డర్లు కూలిపోయి ధ్వంసమయ్యాయి. అప్పటి నుంచి పనులు నిలిచిపోయాయి. దీంతో రెండువైపులా వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.. కూలీ పనులకు వెళ్లేవారు వాగు వరద ప్రవాహంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.. వెంటనే పనులు ప్రారంభించేలా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

–ఈనాడు, హనుమకొండ, న్యూస్‌టుడే టేకుమట్ల



వీరు పెద్దపల్లి జిల్లా ఓడేడు గ్రామానికి చెందిన కూలీలు. నిత్యం 500 మంది వరకు వాగులో నుంచి నడుచుకుంటూ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలానికి కూలీ పనులకు వస్తుంటారు. వాగు ప్రవహిస్తే ఇరువైపులా కాలినడక రాకపోకలు సైతం నిలిచిపోతాయి..

ఈ ప్రయాణం ప్రమాదం



పత్తి పంట దిగుబడులు వస్తుండటంతో వ్యవసాయ కూలీలకు డిమాండ్ పెరిగింది. హనుమకొండ జిల్లా పరకాల నుంచి నిత్యం వందలాది మంది మహిళా కూలీలు ట్రాక్టర్లు, ఆటోల్లో ఇతర గ్రామాలకు వెళ్తున్నారు. వాహనాల్లో పరిమితికి మించి కూలీలను ఎక్కించుకొని తీసుకెళ్తున్నారు. పరకాలలోని వెల్లంపల్లి రోడ్డులో గురువారం కొందరు మహిళలు ఇలా ఆటో వెనుక భాగంలో నిలబడి ప్రమాదకరంగా ప్రయాణించారు. ప్రమాదం జరగకముందే పోలీసులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. – న్యూస్‌టుడే, పరకాల


నేడు ముదిరాజ్ కుల వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్



నర్సంపేట, న్యూస్‌టుడే: తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన 'ఈనాడు' పెళ్లి పందిరి. నెట్ ముదిరాజ్ కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని రెండు రోజులు నిర్వహిస్తోంది. నర్సంపేట కోర్టు హాలు వెనుక ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ వేదికగా ఈ కార్యక్రమం ఉంటుంది. వివాహం కోసం ఎదురు చూస్తున్న వధూవరులతో పాటు సంబంధిత కుటుంబీకులు అక్టోబరు 26, 27 తేదీల్లో (శని, ఆదివారాల్లో) ఉదయం 9 సాయంత్రం 5.30 గంటల వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవాలి. ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్‌లో యాప్ ద్వారా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయాల్సిన వధూవరుల బయోడెటా, ఫొటోలు 83744 45190, 80080 02165 వాట్సాప్ నెంబర్లకు పంపించాలి. మరిన్ని వివరాలకు ఆ నంబర్లలో సంప్రదించాలి.


కాళోజీ కళాక్షేత్రం

● అత్యాధునిక హంగులతో నిర్మాణం పూర్తి



రాష్ట్ర సాంస్కృతిక రాజధానిగా పేరొందిన ఓరుగల్లుకు గర్వకారణంగా నిలిచే కాళోజీ కళాక్షేత్రం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ఇది ఉమ్మడి వరంగల్‌కే తలమానికంగా నిలవనుంది. పలుకుబడుల కవితలతో ప్రజాకవిగా.. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి దాతగా పేరొందిన ఓరుగల్లు ముద్దుబిడ్డ కాళోజీ నారాయణరావు స్మారకార్థం హనుమకొండలోని హయగ్రీవాచారి మైదానంలో కళలకు నిలయంగా ఇది వెలుగొందనుంది.

– న్యూస్‌టుడే, వరంగల్ సాంస్కృతికం



ఓరుగల్లుకు మణిహారం..

- ● మొత్తం విస్తీర్ణం 4.2 ఎకరాలు
- ● నిర్మాణం 4 అంతస్తులు
- ● మొత్తం భవన నిర్మాణం 6172 చదరపు అడుగులు
- ● ప్రహరీతో పాటు గార్డెన్, పార్కింగ్ కలిపి 95,548 చ.అ
- ● వ్యయం రూ.95 కోట్లు



ఆడిటోరియంలో సభావేదిక, పైన విద్యుద్దీపాలు

ప్రాంగణం ఆహ్లాదకరంగా.. కళాక్షేత్రం ఆవరణలో ఆహ్లాదకరమైన గార్డెన్‌తో పాటు పార్కింగ్ సదుపాయం ఉంది. ఇందులో రకరకాల పూలు, అలంకరణ మొక్కలు నాటారు. లోపలికి వెళ్లగానే పచ్చని మొక్కలు స్వాగతం పలుకుతాయి. ప్రవేశమార్గంలో కాళోజీనారాయణ రావు విగ్రహం దర్శనమిస్తుంది.



రవీంద్రభారతికి దీటుగా : హైదరాబాద్ రవీంద్ర భారతికి దీటుగా ఆడిటోరియం ఉంటుంది. రవీంద్రభారతి ఆడిటోరియం సీటింగ్ సామర్థ్యం 980. అదే కళాక్షేత్రంలో 1127 కుర్చీలు ఏర్పాటు చేశారు. ఇందులో అప్పర్ బాల్కనీలో 286 మంది కూర్చోవచ్చు. మిగతావి వరుస క్రమంలో కింద భాగంలో ఉంటాయి. సినిమా టాకీసును మించిన ఆధునిక సదుపాయాలు కల్పించారు. ఆడిటోరియం లోపలికి వెళ్లగానే కళ్లు విప్పారుతాయి. సభావేదికపై కెనరా లైటింగ్స్ ఆడియో, వీడియో సెట్టింగ్స్ చేశారు. స్టేజి వెనుక, ఇరువైపులా బాలురు, బాలికల కోసం 4 గ్రీన్ రూమ్స్, అతిథులు, నిర్వహణ కోసం 12 గదులు ఉన్నాయి. ఒకేసారి 500 మందికి పైగా వేదికపై కూర్చునేలా భారీ వేదిక నిర్మించారు. ప్రవేశ మార్గంలో ఇరు వైపులా సువిశాలమైన కారిడార్స్ నిర్మించారు. నిరంతర విద్యుత్తు సరఫరా కోసం ఆధునిక జనరేటర్ ఏర్పాటు చేశారు. ఆడిటోరియం లోపలికి వెళ్లడం, బయటకు రావడానికి రెండు వైపులా కలిపి ఆరు తలుపులు ఉన్నాయి.






కాళోజీ జ్ఞాపకాలతో ఆర్ట్ గ్యాలరీ


కాళోజీ నారాయణరావు తొలి, మలి దశ ఉద్యమాల్లో పాల్గొన్న చిత్రాలు, ఆయన సాధించిన పురస్కారాలతో ప్రత్యేకంగా ఆర్ట్ గ్యాలరీ ఏర్పాటు చేశారు. జిల్లాలోని కవులు, కళాకారులతో పాటు ప్రముఖుల చేతుల మీదుగా పొందిన పురస్కారాలు, సరదాగా ముచ్చటించిన అరుదైన చిత్రాలను ఇక్కడ చూడొచ్చు.





గ్రంథాలయం ఏర్పాటు చేయాలి..

కాళోజీ నారాయణరావు 1930 నుంచి గ్రంథాలయోద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. తెలంగాణలోని ప్రతి గ్రామంలో గ్రంథాలయం ఉండాలనేది ఆయన ఆకాంక్ష. స్వరాష్ట్ర సాధన కోసం ఆయన అనేక పుస్తకాలు రచించారు. కవితలు, సూక్తులతో ప్రజలను చైతన్యపరిచారు. మరాఠీ, ఆంగ్లం, ఉర్దూ బాషల్లో పండితుడు. అనేక ఇతర భాషా గ్రంథాలను తెలుగులోకి అనువదించారు. నా భారతదేశ యాత్ర, పార్థివ వ్యయం, కాళోజీ కథలు, నా గొడవ, జీవనగీత, తుది విజయం మనది, తెలంగాణ ఉద్యమ కవితలు, ఇదీ నా గొడవ, బాపూ! బాపూ! బాపూ! లాంటి అనేక కవితా సంపుటాలు రచించారు. ఆయన రచనలతో కళాక్షేత్రంలో ప్రత్యేకంగా గ్రంథాలయం ఏర్పాటు చేస్తే భావి తరాలు వాటి గొప్పతనం తెలుసుకునే అవకాశం ఉంది.





విద్యుత్తు తీగలకు.. ఊతమైన కర్ర

జనగామ మండలం మరిగడి గ్రామంలో పలు చోట్ల వ్యవసాయ బావుల వద్ద విద్యుత్తు తీగలు తక్కువ ఎత్తులో యమపాశాల్లా వేలాడుతున్నాయి. ప్రస్తుతం వరి కోతల సీజన్ కావడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు సంభవిస్తాయోనని రైతులు, వరి కోత యంత్రాల యజమానులు ఆందోళన చెందుతున్నారు. గానుగుపహాడ్-మరిగడి రహదారి పక్కన ఓ రైతు పొలంలో 11 కె.వి విద్యుత్తు తీగలు వేలాడుతుండగా, రైతు పైకి లేపేందుకు ఓ కర్రను ఏర్పాటు చేశారు ఇలా.. వర్షాలు కురిస్తే భూమికి ఎర్తింగ్ వచ్చే ప్రమాదం ఉంది. ఈ విషయమై ఎన్పీడీసీఎల్ జనగామ రూరల్ ఏఈ మధును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. వెంటనే మిడిల్ స్తంభాన్ని ఏర్పాటు చేయిస్తామని తెలిపారు.

– న్యూస్‌టుడే, జనగామ రూరల్

నిలిచిపోయిన గూడ్స్ రైలు

కేసముద్రం, న్యూస్‌టుడే: విజయవాడ - కాజీపేట మార్గంలో వెళ్తున్న ఓ గూడ్స్ రైలు ఓవర్‌హెడ్ ఎలక్ట్రిఫికేషన్ (ఓహెచ్ఈ)లో సాంకేతిక లోపం ఏర్పడి తాళ్లపూసపల్లి, కేసముద్రం రైల్వే స్టేషన్ల మధ్య 428 కి.మీ., వద్ద శుక్రవారం ఉదయం 8.15 గంటలకు నిలిచిపోయింది. రైల్వే అధికారులు మరో రైలు ఇంజిన్‌ను కేసముద్రం నుంచి తెప్పించి ఆగిన గూడ్స్‌కు అమర్చడంతో 9.20 గంటలకు కదిలింది. ఆ మార్గంలో వెళ్తున్న పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. మహబూబాబాద్‌లో కోర్బా ఎక్స్‌ప్రెస్, సింగరేణి, డోర్నకల్‌లో శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైళ్లు సుమారు గంటపాటు నిలిచిపోయాయి.

ప్రజల అర్జీలు పరిశీలించిన మంత్రి సురేఖ



లేబర్‌కాలనీ, న్యూస్‌టుడే: వరంగల్ ఓసిటీలోని తన క్యాంపు కార్యాలయానికి రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శుక్రవారం వచ్చారు. నగరంలోని పలు డివిజన్ల నుంచి నాయకులు, ప్రజలు తరలివచ్చి మంత్రికి విజ్ఞాపన పత్రాలు అందించారు. వరంగల్ వెంకట్రామా టాకీస్ సమీపంలోని శ్మశానవాటిక స్థలాన్ని కొందరు ఆక్రమించి భవనం కట్టి అద్దెకిచ్చారని మంత్రి దృష్టికి తెచ్చారు. కబ్జా అంశంపై వరంగల్ తహసీల్దారు ఎండీ ఇక్బాల్‌కు ఫోన్ చేసి మంత్రి ఫిర్యాదుకు సంబంధించిన అంశంపై తనకు పూర్తి వివరాలు కావాలని కోరారు. సమస్యల ఆధారంగా సంబంధిత అధికారులకు తగు ఆదేశాలిచ్చి అక్కడికక్కడే పరిష్కారానికి కృషి చేశారు.

హరిత పర్వతాలు.. పైన హిమాలయాలు...!



అక్కడి పరిసరాలన్నీ హరిత వర్ణంతో ముసుగేసినట్లు కనిపిస్తాయి. దేశ సరిహద్దుల్లో ఉన్న హిమాలయాలు లాగా హరిత కొండలు కనువిందు చేస్తాయి. ఆకాశం పైన ధవళ వర్ణంలో ఉన్న మేఘాలు మంచు కొండల్ని తలపిస్తున్నాయి. ధర్మసాగర్, వేలేరు, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల పరిధిలో విస్తరించిన ఇనుపరాతి గుట్టల ప్రకృతి రమణీయత కట్టిపడేస్తోంది. ఈత చెట్టును ఆవాసంగా మార్చుకుని ఉన్న గిజిగాని పక్షుల గూళ్లు ఆకాశంలో ఉన్న భ్రాంతి కలుగుతోంది. హనుమకొండ జిల్లా వేలేరు మండలం ఎర్రబెల్లి గ్రామ శివారులో తీసిన సుందర చిత్రాలు. – ఈనాడు, హనుమకొండ



చికెన్ ధరలు వెన్‌కాబ్ (కిలో వెల రూపాయలలో)			
ఫాం:	115	డ్రెస్డ్:	199
రిటైల్:	137	స్కిన్‌లెస్:	226

కేఎంసీలో పరిశోధనోత్సవం ప్రారంభం



క్విజ్ కార్యక్రమంలో పాల్గొన్న వైద్య విద్యార్థులు



అస్థిపంజరంతో ఫొటో..



సీపీఆర్‌తో ప్రాణాలు నిలపడం ఎలానో వివరిస్తూ..

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: కాకతీయ వైద్య కళాశాల ఎన్ఆర్ఐ భవనంలో 'కాకతీయ రీసెర్చ్ ఇనిషియేటివ్ ఫర్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్నోవేషన్స్' (కృతి) రెండో పరిశోధనా దినోత్సవ సదస్సు శుక్రవారం మొదలైంది. రాష్ట్రంలోనే మొదటి సారి అండర్ గ్రాడ్యుయేట్, పీజీ విద్యార్థులను క్లినికల్ వైద్యంతోపాటు పరిశోధనల వైపు మళ్లించడానికి నిర్వహిస్తున్న ఈ సదస్సుకు రాష్ట్రం సహా, దేశం నలుమూలల నుంచి వచ్చిన వైద్యవిద్యార్థులు హాజరయ్యారు. కేఎంసీ యూఎస్ఏ అల్యూమిని, కాకతీయ రీసెర్చ్ ఇనిషియేటివ్ ఫర్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్నోవేషన్స్ కన్వీనర్ డాక్టర్ సుజిత్ ఆర్ పున్నం, డాక్టర్ వేణు జి.బత్తిని అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో మొదటిరోజు డిబేట్, హ్యాకథాన్, జెపార్టీ(ఇండియాలోనే అతిపెద్ద మెడ్ క్విజ్) పోటీలు నిర్వహించారు. వైద్యపరిశోధనకు ఉపయోగపడేలా ఆటపాటలతో కూడిన క్విజ్ పోటీలు ఆకట్టుకున్నాయి. ఎన్ఆర్ఐ భవనం ఆవరణలో ఏర్పాటుచేసిన స్టాళ్లలో జూనియర్ వైద్యవిద్యార్థులకు సీనియర్ విద్యార్థులు వైద్య అవగాహన కల్పించారు. ఇందులో శరీర నిర్మాణం, డయాలసిస్ ద్వారా కృత్రిమ రక్తశుద్ధి విధానం, గుండె పనితీరు. కార్డియాక్ అరెస్టు అయిన వ్యక్తిని పీసీఆర్ చేయడం ద్వారా ఎలా బతికించొచ్చు అనే అంశాలపై అవగాహన కల్పించారు. వైద్య పరికరాలు, విజ్ఞానానికి సంబంధించి ఏర్పాటుచేసిన స్టాళ్లలో వైద్య పదజాలంతో కూడిన ఆటలు నిర్వహించారు.



వివిధ స్టాళ్ల వద్ద విద్యార్థులు

కేయూ ఈఈఈ పాఠ్య ప్రణాళిక అధ్యక్షురాలిగా సుమలత



ఉప కులపతి నుంచి ఉత్తర్వులు అందుకుంటున్న సుమలత

విద్యానగర్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయం ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజినీరింగ్ (ఈఈఈ) విభాగం నూతన పాఠ్య ప్రణాళిక అధ్యక్షురాలిగా సహ ఆచార్యులు సుమలత నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత అధ్యక్షులు కె.వీనా నుంచి ఆమె బాధ్యతలు స్వీకరించి, ఈ పదవిలో రెండేళ్లపాటు కొనసాగుతారు. సుమలతకు 14 ఏళ్ల బోధనానుభవం ఉంది. ఎన్ఎస్ఎస్ అధికారిగా, హాస్టల్ అదనపు సంచాలకులుగా, ఈఈఈ విభాగాధిపతిగా బాధ్యతలు నిర్వహించారు. ఉప కులపతి ఆచార్య కె.ప్రతాపరెడ్డి నుంచి ఆమె నియామక ఉత్తర్వులు అందుకున్నారు.

సైకిల్ సవారీ.. ఆరోగ్యమేమరి..



డిజిటల్ మీటర్



సైకిల్‌పై రయ్ మంటూ వెళ్తున్న యువకుడు హనుమకొండలోని వికాస్‌నగర్‌కు చెందిన తోకల రాజురెడ్డి. తాను రోజూ భవన నిర్మాణ అవసరాల నిమిత్తం నగరంలో సైకిల్‌పైనే సుమారు 40 కిలోమీటర్లు తిరుగుతానని చెబుతున్నారు. దీనికి బ్యాటరీతో కూడిన మోటారు కూడా ఉండటంతో 15 కిలోమీటర్లు తొక్కుతూ.. మిగతాది బ్యాటరీ మోటారు ఆన్‌చేసి వెళ్తుంటానని తెలిపారు. ఒకసారి ఛార్జింగ్ చేస్తే 50 కిలోమీటర్ల వరకు ప్రయాణం చేయొచ్చని చెప్పారు. సైకిల్‌కు ఏడు గేర్లు ఉంటాయని, హ్యాండిల్‌కు వేగాన్ని సూచించే డిజిటల్ మీటరు కూడా ఉంటుందన్నారు. ఇది వరకు తనకు బుల్లెట్ బండి ఉండేదని, దానికి ఇంధన ఖర్చు ఎక్కువ అవుతుండటంతో రెండు నెలల కిందట రూ.50 వేలు వెచ్చించి ఈ సైకిల్ కొన్నానని తెలిపారు. ప్రస్తుతం నెలకు సుమారు రూ.3 వేలకుపైగా ఆదా అవుతోందని, సైకిల్ తొక్కడం వల్ల ఆరోగ్యంగా ఉంటున్నానని ఉత్సాహంగా చెప్పారు. – ఈనాడు, హనుమకొండ

అర్హులకే ప్రభుత్వ పథకాలు

మహబూబాబాద్, న్యూస్‌టుడే: నిజమైన లబ్ధిదారులకే సంక్షేమ పథకాలు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టమైన విధానంతో ముందుకు వెళుతుందని ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్ అన్నారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు తహసీల్దార్ భగవాన్‌రెడ్డితో కలిసి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల ఇందిరమ్మ కమిటీల ఎంపికలో కాంగ్రెస్ నాయకుల మధ్య విభేదాలు సృష్టించేందుకు భారాస నేతలు కొందరు కాంగ్రెస్ కార్యకర్తలను ఉసిగొల్పుతూ పార్టీని బదనాం చేయాలని ప్రయత్నిస్తున్నారన్నారు. వారి మాటలు విని ఎవరూ మోసపోవద్దన్నారు. తొమ్మిదేళ్ల భారాస పాలనలో ఎన్ని ఇబ్బందులు పెట్టిన కొందరు నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నారన్నారు. అలాంటి వారిని పార్టీ ఆదుకుని ప్రాధాన్యమిస్తుందన్నారు. వచ్చే స్థానిక సంస్థల్లో పోటీ చేయాలనుకునే నాయకులు, కార్యకర్తలు సత్ప్రవర్తన కలిగి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు నీరుటి లక్ష్మీనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు రామిరెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ. ఖలీల్, నాయకులున్నారు.



కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్

'రైతులను నిలువునా ముంచిన రాష్ట్ర ప్రభుత్వం'

మహబూబాబాద్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం రైతులను నిలువునా ముంచిందని.. ఆగ్రహంతో ఉన్న రైతులు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకుల గ్రామాల్లో తిరగనివ్వని రోజులు వస్తున్నాయని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రవీందర్‌రావు మాట్లాడారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాన్ని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రైతు భరోసా ఇవ్వలేదని, పూర్తిగా రుణమాఫీ చేయక మోసం చేసిందన్నారు. ఇటీవల వర్షాలతో దెబ్బతిన్న రహదారులు, చెరువులను పునరుద్ధరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ధాన్యానికి బోనస్ ఇవ్వడంలో తీరని అన్యాయం చేసిందని ఆరోపించారు. జిల్లా కేంద్రంలో గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసి మోడల్ మార్కెట్ నిర్మిస్తే ఇప్పటివరకు తాళాలు వేశారన్నారు. వారం రోజుల్లో తెరవకుంటే కూరగాయల వ్యాపారులే ఆక్రమించుకుంటారన్నారు. లేదంటే ప్రస్తుతం కూరగాయల మార్కెట్ నిర్వహిస్తున్న గాంధీపార్కుకు తాళం వేస్తామన్నారు. అధికారుల్లో విపరీతమైన అవినీతి పెరిగిందని వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోకుంటే ఆందోళన చేస్తామన్నారు. సమావేశంలో పురపాలక సంఘం అధ్యక్షుడు పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మార్నేని వెంకన్న, వార్డు కౌన్సిలర్ ఎడ్ల వేణు, భారాస మండల అధ్యక్షుడు తేళ్ల శ్రీనివాస్, భారాస నాయకులున్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

మేమున్నాం.. మీకు తోడుగా

మహబూబాబాద్ టౌన్: 98859 29762,
మహబూబాబాద్: 9441084123, తొర్రూరు టౌన్: 97019 14499
డోర్నకల్: 94405 15786, మరిపెడ: 80085 74823

డోర్నకల్, న్యూస్‌టుడే: డోర్నకల్‌లోని యాదవనగర్‌లో విద్యుత్తు నియంత్రిక పరిసరాల్లో పిచ్చి చెట్లు ఏపుగా పెరిగాయి. - వీరభద్రం

ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. - అఫ్జల్, హెల్త్ ఇన్‌స్పెక్టర్, డోర్నకల్

డోర్నకల్: మోద్దుగడ్డతండా వద్ద కాలువలో పేరుకుపోయిన మురుగుతో దుర్వాసన వస్తుంది. - రాజు

శుభ్రం చేయిస్తాం. - మున్వర్‌బేగ్, ఎంపీవో, డోర్నకల్

దార్ల మృతి సాహిత్యలోకానికి తీరని లోటు



మాట్లాడుతున్న సీతారాములు

మానుకోట, న్యూస్‌టుడే: సమాజంలో అణగారిన దళిత బహుజనుల చైతన్యం కోసమే దార్ల రామచంద్ర తన సాహిత్య వ్యాసంగాలతో ఉద్యమాలతో కృషి చేశారని దళిత బహుజనుల రచయితల కవుల కళాకారుల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కోమురెల్లి సీతారాములు అన్నారు. అనారోగ్యంతో మరణించిన సాహితీవేత్త రామచంద్ర మృతదేహానికి శుక్రవారం జిల్లా కేంద్రంలో అంత్యక్రియలు జరిగాయి. సీతారాములు హాజరై సంతాప సమావేశంలో మాట్లాడారు. రామచంద్ర అనేక కష్టాలను ఎదుర్కొని ఉపాధ్యాయ వృత్తిలో అలాగే సాహిత్యరంగంలో అంచెలంచెలుగా ఎదిగారన్నారు. ఆయన మరణం సాహిత్యలోకానికి తీరని లోటు అని పేర్కొన్నారు. కవులు, సాహిత్య అభిమానులు కొమురె వెంకన్న, మద్దెర్ల రమేశ్, వజ్రం నాగేశ్వరరావు, ముల్క రవి, రాజు, ప్రభాకర్ తదితరులున్నారు.

భవిష్యత్తు కమ్యూనిస్టులదే

మహబూబాబాద్ టౌన్, న్యూస్‌టుడే: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆవిర్భవించి వందేళ్లు కావస్తున్న సందర్భంగా ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర సహాయకార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు పార్టీ శ్రేణులకు కోరారు. సీపీఐ జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని శుక్రవారం పట్టణంలోని వీరభవనంలో వరిపెల్లి వెంకన్న అధ్యక్షతన ఏర్పాటు చేశారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు చేసిన ఘనత సీపీఐకే దక్కుతుందన్నారు. రానున్న రోజుల్లో కమ్యూనిస్టు పార్టీలకే ప్రజలు పట్టం కడుతారని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ సత్తా చాటాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథిరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అజయ్‌సారథిరెడ్డి, నల్లు సుధాకర్‌రెడ్డి, కట్టెబోయిన శ్రీనివాస్, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్ తదితరులున్నారు.



ప్రసంగిస్తున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాస్

భాజపా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

గార్ల, న్యూస్‌టుడే: భాజపా అవలంబిస్తున్న మతోన్మాదం, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు నాగయ్య పార్టీ శ్రేణులను కోరారు. స్థానిక వర్తకసంఘం భవనంలో శుక్రవారం రాజారావు, గోవింద్, సత్యావతి అధ్యక్షతన సీపీఎం తొమ్మిదో మండల మహాసభ నిర్వహించారు. దేశంలో నిరుద్యోగం, పేదరికం పెరిగాయన్నారు. భాజపాను నిలువరించేందుకు అన్ని పార్టీలను కలుపుకొని ఉద్యమించాలన్నారు. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండు చేశారు. వామపక్షాల ఉద్యమాల ఫలితంగా ఉపాధిహామీ చట్టం, ఆహారభద్రత, పోడు సాగుదారులకు హక్కుచట్టం వచ్చినట్లు వెల్లడించారు. భారాస గత పదేళ్లలో ప్రజలకు ప్రయోజనాలు చేకూర్చిందేమి లేదన్నారు. తొలుత ఇటీవల మరణించిన సీపీఎం నాయకులు, పార్టీ శ్రేణులకు నివాళులర్పించారు. అంబటి వీరస్వామి పార్టీ జెండాను ఎగురవేశారు. మహాసభలో రాష్ట్ర కమిటీ సభ్యులు సోమయ్య, జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, జిల్లా సెక్రటేరియట్ సభ్యులు కె.శ్రీనివాస్, వెంకన్న, వీరయ్య, అశోక్, ఉపేందర్, రామకృష్ణ, హరి, కవిత, మౌనిక తదితరులు ఉన్నారు.



గార్లలో సీపీఎం నాయకుల ర్యాలీ

పెట్టుబడి పేరుతో రూ.19లక్షల మోసం

రాయదుర్గం, న్యూస్‌టుడే: బ్యాంకు ట్రేడింగ్ యాప్ ద్వారా ఐపీఓలో పెట్టుబడి పెట్టి అధిక లాభాలు పొందవచ్చని చెప్పి డబ్బులు తీసుకొని మోసం చేసిన నిందితుడిని సైబరాబాద్ సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ కె.శంకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా మరిపెడ గ్రామానికి చెందిన కారంపూడి రాజేశ్(35) వేవ్‌టెక్ ఇన్ఫో సొల్యూషన్ పేరుతో ఓ సంస్థ స్థాపించాడు. హైదరాబాద్ నగరానికి చెందిన ఓ బాధితుడికి ఫోన్ చేసి తాను ఓ ప్రముఖ బ్యాంకు ప్రతినిధినంటూ పరిచయం చేసుకున్నాడు. తమ బ్యాంకు ట్రేడింగ్ యాప్ ద్వారా ఐపీఓ (ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్)లో పెట్టుబడి పెట్టి అధిక లాభాలు పొందవచ్చని చెప్పాడు. అతడి సూచన మేరకు బాధితుడు నకిలీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నాడు. రాజేశ్ సూచించిన పలు ఖాతాల్లో బాధితుడు రూ.19.90 లక్షలు ఆన్‌లైన్‌లో పంపాడు. తర్వాత నిందితుడు అందుబాటులో లేకుండా పోయాడు. అతడి ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వేవ్ టెక్ ఇన్ఫో సొల్యూషన్స్ సంస్థ పేరిట ఉన్న అకౌంట్‌లోకి కొంత డబ్బు చేరినట్లు దర్యాప్తులో తెలుసుకున్న పోలీసులు దాని ఆధారంగా నిందితుడిని అరెస్టు చేశారు. అతడు సైబర్ నేరగాళ్ల వద్ద మోసాలపై శిక్షణ పొందినట్లు, మోసగించాక ఎలా సాక్ష్యాలను మాయం చేయాలో నేర్చుకున్నట్లు విచారణలో తేలింది.

అసత్య ఆరోపణలపై చర్యలకు వినతి

తొర్రూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ భూదాన్ భూముల విషయంలో అక్రమాలు జరిగాయని, అందులో మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రమేయం ఉందని, ఈ విషయమై ఈడీ నిఘా పెట్టిందని అసత్య ఆరోపణలు చేస్తూ పలు డిజిటల్ పత్రికలు అర్థం లేని రాతలు రాయడం విచారకరమని భారాస మండలాధ్యక్షుడు సీతారాములు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాస్‌లు ఆక్షేపించారు. అసత్య రాతలు రాసిన డిజిటల్ పత్రిక యాజమాన్యాలపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని భారాస సోషల్‌మీడియా ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై ఉపేందర్‌కు వినతి పత్రం అందించారు. దయాకర్‌రావు స్థాయిని దెబ్బతీయడానికి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. పార్టీ నాయకులు ప్రమోద, ప్రదీప్‌రెడ్డి, శ్రీనివాస్, నాగరాజు, కాలునాయక్, రాజు పాల్గొన్నారు.

విద్యుత్తు ప్రమాదాల నివారణపై అవగాహన

పెద్దవంగర, న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖ పొలంబాటలో భాగంగా మండలంలోని బొత్తలతండాలో పత్తిచేనులో పత్తి ఏరుతున్న రైతులు, కూలీలకు డీఈఈ మధుసూదన్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ, వ్యవసాయ విద్యుత్తు సర్వీస్ తీగలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి, మోటార్లకు కెపాసిటర్లు బిగించుకోవాలని సూచించారు. ఎలాంటి సమస్యలు ఉన్నా విద్యుత్తు అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఏఈ రమేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ధర్నా గోడప్రతుల ఆవిష్కరణ

తొర్రూరు, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా ఆటోడ్రైవర్లు ఐకాసగా ఏర్పడి తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వచ్చే నెల 5వ తేదీన నిర్వహించే చలో హైదరాబాద్ ధర్నా కార్యక్రమ గోడప్రతులు శుక్రవారం డివిజన్ కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి మాట్లాడుతూ.. మహాలక్ష్మీ పథకంతో నష్టపోతున్న ఆటోడ్రైవర్లకు నెలకు రూ.12 వేలు అందిస్తామన్న ప్రభుత్వ హామీ మేరకు ఇవ్వాలన్నారు. ధర్నాకు వేలాదిగా తరలిరావాలని కోరారు. కార్మికులు మల్లేశ్, మోహన్, సాయి, ఉపేందర్, అరవింద్, రవి తదితరులు పాల్గొన్నారు.

పశుగణనకు చర్యలు



మహబూబాబాద్, న్యూస్‌టుడే: పశు సంపద సమాచారాన్ని సేకరించి డిజిటలైజేషన్ ద్వారా పోర్టల్‌లో నమోదు కోసం ఇంటింటికి వెళ్లి పశుగణన చేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్‌టొప్పో అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పశుగణన గోడపత్రికల ఆవిష్కరణ కార్యక్రమంలో టొప్పో మాట్లాడారు. జిల్లాలో పశుగణన కోసం 23 మంది సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో 76 మంది ఎన్యూమరేటర్లతో అన్ని గ్రామాలు, పట్టణాల్లో వివరాలు సేకరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రామచంద్ర, ఎన్.అశోక్, నోడల్ అధికారి శ్రావణ్‌కుమార్, ఆర్.ప్రియదర్శిని, రాజేందర్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

కురవి, న్యూస్‌టుడే: స్థానిక సంస్థల ఎన్నికల్లో సమష్టిగా కృషి చేసి సత్తా చాటాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రామచంద్రునాయక్ పార్టీ కార్యకర్తలను కోరారు. శుక్రవారం కురవిలో కల్యాణలక్ష్మి, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేసి, ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. అయ్యగారిపల్లిలో ఇంటిగ్రేటెడ్ గురుకులాన్ని మంజూరు చేయాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ సంఘం నాయకులు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు భరత్‌చంద్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వీరభద్రం, తహసీల్దార్లు సునీల్‌రెడ్డి, శారద, ఎంపీడీవో వీరబాబు, ఆలయ ఛైర్మన్ రవీందర్ రెడ్డి, గార్లపాటి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



కురవిలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే రామచంద్రునాయక్

చిన్నగూడూరు: ప్రచార ఆర్భాటాలు లేకుండా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం అమలు చేస్తోందని డోర్నకల్ శాసనసభ్యుడు రామచంద్రునాయక్ అన్నారు. చిన్నగూడూరులో శుక్రవారం కల్యాణలక్ష్మి చెక్కులు, సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందించారు. జయ్యారం గ్రామంలో బస్సు సౌకర్యాన్ని పునఃప్రారంభించారు. తహసీల్దార్ మహబూబ్ అలీ, ఎంపీడీవో రామరావు, బస్సు డిపో ఉప కార్యనిర్వహణ అధికారి గోపి శ్రీనివాస్, కాంగ్రెస్ సీనియర్ నేతలున్నారు.

మరిపెడ: మరిపెడ పట్టణంలోని పలు వార్డుల్లో డోర్నకల్ శాసనసభ్యుడు, ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రునాయక్ శుక్రవారం పర్యటించారు. మాకుల తండా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు, దుప్పట్లు, ప్లేట్లు పంపిణీ చేశారు. స్థానిక నాయకులున్నారు.

కత్తితో యువకుడి హల్‌చల్

కేసముద్రం, న్యూస్‌టుడే: గుర్తు తెలియని యువకుడు చేతిలో కత్తి పట్టుకొని వీధుల వెంట తిరుగుతూ తనకు తాను శరీరంపై గాయాలు చేసుకుంటూ హల్‌చల్ చేసిన సంఘటన శుక్రవారం కేసముద్రం మండలం ఇంటికన్నె గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై మురళీధర్‌రాజు తెలిపిన వివరాల మేరకు.. గుర్తు తెలియని యువకుడు రెండు రోజుల కిందట ఇంటికన్నె రైల్వే స్టేషన్‌లో దిగి పరిసరాల్లో తిరుగుతున్నాడు. నిత్యం మత్తులో ఉంటున్న ఆ యువకుడు శుక్రవారం సాయంత్రం ఇంటికన్నె రైల్వే స్టేషన్ సమీపంలోని స్టేషన్ తండాలో చేతిలో కత్తి, ఇనుప చువ్వ పట్టుకొని కత్తితో పొట్టలో, శరీరంపై గాయాలు చేసుకుంటూ తండావాసులను భయభ్రాంతులకు గురి చేశాడు. సీసాలు పగలగొడుతూ, తండావాసులపై రాళ్లు విసురుతూ వీరంగం సృష్టించాడు. పోలీసులు వచ్చి యువకుడిని పట్టుకొని తాళ్లతో కట్టేసి 108లో ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆ యువకుడి తలకు గాయాలైనట్లు ఎస్సై తెలిపారు.

సైబర్ మోసం

నర్సింహులపేట, న్యూస్‌టుడే: చరవాణిలో వచ్చిన లింక్‌ను క్లిక్ చేయడంతో సైబర్ మోసగాళ్లు రూ.7.60లక్షలు మాయం చేసిన సంఘటన నర్సింహులపేట మండలంలోని పడమటిగూడెంలో వెలుగులోకి వచ్చింది. ఎస్సై మాలోతు సురేష్ శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. పడమటిగూడెం గ్రామానికి చెందిన అక్కిరెడ్డి వేణు హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నారు. అతని చరవాణి నెంబరుకి జనవరిలో టెలిగ్రామ్‌లో ఓ సంస్థకు చెందిన లింక్ వచ్చింది. అందులో పెట్టుబడులు పెడితే లాభాలు వస్తాయని సైబర్ నేరగాడు ఆశ చూపాడు. అతని నమ్మించేందుకు రెండుసార్లు బాధితుడి ఖాతాలో డబ్బులు జమయ్యాయి. ఈ క్రమంలో వేణు లింక్‌లను నొక్కి వివరాలతో పాటు ఓటీపీ నంబర్లు సైబర్ నేరగాళ్లకు తెలియజేశారు. దీంతో అతని ఖాతా నుంచి రూ.7.69లక్షలు స్వాహా చేశారు. సంబంధిత నంబర్లకు ఫోన్ చేయడంతో స్పందన రాలేదు. సైబర్ మోసం జరిగిందని గ్రహించి 1930 నంబరుకు ఫిర్యాదు చేయడంతో రూ.1.05 లక్షలను హోల్డ్‌లో పెట్టగలిగారు. వేణు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

విధులకు అడ్డుపడిన ఒకరి అరెస్టు

నెల్లికుదురు, న్యూస్‌టుడే: తహసీల్దారు, రెవెన్యూ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించి, అసభ్య పదజాలంతో దూషించిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై చిర్రా రమేష్‌బాబు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బ్రాహ్మణకొత్తపల్లి శివారు ఆకేరు వాగు నుంచి నిబంధనలకు విరుద్ధంగా బ్రాహ్మణకొత్తపల్లికి చెందిన జెల్ల యాకయ్య ఇసుక తరలిస్తున్నాడు. ట్రాక్టర్లను నియంత్రించడానికి ఆర్ఐ అబ్దుల్‌రెహమాన్, రెవెన్యూ సిబ్బంది వెళ్లారు. వాహనాలను తహసీల్దారు కార్యాలయానికి తరలించే క్రమంలో యాకయ్య వారిని ఇబ్బందులకు గురి చేశారు. సమాచారం తెలుసుకున్న తహసీల్దారు కె.రాజు ఘటనాస్థలికి చేరుకొన్నారు. అతడ్ని కూడా అసభ్యకర పదజాలంతో దూషించి, దాడికి యత్నించాడు. పోలీసులు వెళ్లి ట్రాక్టర్లను ఠాణాకు తరలించారు. తమ విధులకు ఆటంకం కలిగించి, దూషించిన వ్యక్తిపై తహసీల్దారు కె.రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు వివరించారు.

రిమాండుకు తరలింపు

గార్ల, న్యూస్‌టుడే: సీతంపేటలో ఈ నెల 20న గుమ్మడి మహేష్ అనుమానాస్పదస్థితి మృతిలో నిందితులు ముగ్గురిని శుక్రవారం అరెస్టుచేసి మహబూబాబాద్ జిల్లా న్యాయస్థానానికి రిమాండుకు తరలించినట్లు గార్ల, బయ్యారం సీఐ రవికుమార్, ఎస్ఐ జీనత్‌కుమార్ తెలిపారు. మృతుడు లైంగిక వేధింపులకు గురిచేయడంతో ఓ పథకం ప్రకారమే హత్య చేసినట్లు కృష్ణ, మంజుల విచారణలో అంగీకరించారని పేర్కొన్నారు. వీరిద్దరితో పాటు కృష్ణ మామ వెంకన్నను కూడా అనుమానిస్తూ రిమాండుకు పంపినట్లు వెల్లడించారు.

స్వామివారికి పవళింపు సేవ



గార్ల, న్యూస్‌టుడే: మద్రిగూడెంలో బ్రహ్మోత్సవాల నంతరం స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారికి పవళింపుసేవ నిర్వహించారు. ఆలయ అర్చకులు రామాయణం గోవిందచార్యులు, అచ్యుతాచార్యులు, విష్ణువర్ధన్ తొలుత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ధార్మిక కమిటీ సభ్యులు స్వామివారిని స్తుతిస్తూ పాటలు పాడారు.

ముగ్గురు ఏఈల కేటాయింపు

దంతాలపల్లి, న్యూస్‌టుడే: దంతాలపల్లి మండలానికి ప్రభుత్వం ముగ్గురు ఏఈలను కేటాయించినట్లు ఎస్సారెస్పీ డీఈ వినయ్ తెలిపారు. స్థానికంగా శుక్రవారం ఆయన 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. గతంలో ఏఈగా విధులు నిర్వర్తించిన మౌనిక హైదరాబాద్‌కు బదిలీపై వెళ్లినట్లు చెప్పారు. ఆమె స్థానంలో శ్యామ్‌ప్రసాద్ బదిలీపై ఇక్కడికి ఏఈగా వచ్చారన్నారు. కాగా ప్రభుత్వం ఇటీవల చేపట్టిన ఖాళీల భర్తీలో భాగంగా వెంకటేష్, నిఖిల్‌ను కేటాయించినట్లు పేర్కొన్నారు.

సంక్షిప్తంగా

విద్యార్థులున్న పాఠశాలలకే సర్దుబాటు చేయాలి

నర్సింహులపేట, న్యూస్‌టుడే: విద్యార్థులు అత్యధికంగా ఉండే పాఠశాలలకే ఉపాధ్యాయుల సర్దుబాటును పారదర్శకంగా చేయాలని టీపీటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు వై క్రాంతికుమార్, శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన టీపీటీఎఫ్ మండల కమిటీ సమావేశంలో శుక్రవారం మాట్లాడారు. టీపీటీఎఫ్ సభ్యులు యాకన్న, నరసింహారావు, బాలాజీ పలువురు పాల్గొన్నారు.

వాహనాల వేలంపై విచారణ అవసరం

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: మహబూబాబాద్‌లోని ఎక్సైజ్ కార్యాలయంలో నిర్వహించిన వాహనాల వేలం పాటలో అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించారని లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుగులోతు భీమానాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఈ విషయమై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

నెల్లికుదురు, న్యూస్‌టుడే: పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని మండల ప్రత్యేక అధికారి జినుగు మరియన్న సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెహ్రూ యువకేంద్రం వరంగల్ మై భారత్ ఆధ్వర్యంలో 'అమ్మ పేరిట మొక్క నాటుదాం' కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులున్నారు.

మరమ్మతులు ప్రారంభం



దంతాలపల్లి, న్యూస్‌టుడే: భారీ వర్షాలకు దెబ్బతిన్న ఆగాపేటలోని హనుమంతుని చెరువుకట్ట మరమ్మతు పనులను తొర్రూరు మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ భట్టునాయక్, నీటిపారుదలశాఖ డీఈ వినయ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారీ వర్షాలకు చెరువు కట్ట కోతకు గురై దెబ్బతిందన్నారు. వీటి మరమ్మతునకు ప్రభుత్వం రూ.1.98 లక్షలు మంజూరు చేశామన్నారు. స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పారా మెడికల్ కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ

మహబూబాబాద్, న్యూస్‌టుడే: మహబూబాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలో డీఎంఎస్‌టీ, డీఈసీజీ పారా మెడికల్ కోర్సులకు ఈ నెల 30 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వెంకట్‌లకావత ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తుతో పాటు విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులు, స్వీయ ధ్రువీకరణ పత్రం కూడా సమర్పించాలని ఆయన కోరారు. తమ దరఖాస్తు ఫారాలను www.tspmb.telangana.gov.in వెబ్‌సైట్‌లో అంతర్జాలం ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

గార్ల, న్యూస్‌టుడే: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి మదార్ కోరారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ప్రధానాచార్యురాలు రాజకుమారి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మాదక ద్రవ్యాల వినియోగంతో జరిగే అనర్థాలను ఆయన వివరించారు. ఉన్నత విద్యను అభ్యసించి ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

మరిపెడ, న్యూస్‌టుడే: మరిపెడ మండలం ఎల్లంపేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని గుడిసె శ్రీనిత అండర్ 17 రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలలో బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాస్కర్ రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అక్టోబర్ 23,24,25 తేదీల్లో గద్వాలలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ఐ క్రీడా పోటీల్లో అండర్ 32 కేజీ తైక్వాండో విభాగంలో శ్రీనిత బంగారు పతకం సాధించిందన్నారు. శ్రీనితను పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు రాంబాబు, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

ఉపకార వేతనాలు విడుదల చేయాలని వినతి

మహబూబాబాద్ టౌన్, కేసముద్రం, న్యూస్‌టుడే: ఉపకార వేతనాలు, ఫీజు బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ విద్యార్థులు జిల్లా కేంద్రంలో తహసీల్దారు కార్యాలయం ఎదుట, కేసముద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. మానుకోటలో సమాఖ్య జిల్లా సమన్వయకర్త పట్ల మధు తదితరలుఉ తహసీల్దార్ భగవాన్‌రెడ్డికి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ గుగులోతు సూర్యప్రకాశ్, గుండ్ల రాకేష్, ప్రవీణ్, మహేష్, పలు కళాశాలల విద్యార్థులు తదితరులున్నారు. కేసముద్రంలో సంఘం బాధ్యులు చరణ్, అరుణ్, వినయ్, తరుణ్, అన్వేశ్, రాజేశ్ తదితరులున్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారం ఘనత పీఆర్‌టీయూదే



బయ్యారంలో ప్రచార కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు

బయ్యారం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలపై పీఆర్‌టీయూ నిత్యం పోరాడి పరిష్కరించడం జరిగిందని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎస్. బద్రీనారాయణ పేర్కొన్నారు. బయ్యారం ప్రభుత్వ జూనియర్ కళాశాల, బయ్యారం, జీకేపేట, వెంకట్రాంపురం, ఉప్పలపాడు, రంగాపురం ప్రభుత్వపాఠశాలలతో పాటు కేజీబీవీలలో సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై శుక్రవారం అవగాహన కల్పించి ప్రచారం నిర్వహించారు. పీఆర్‌టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి పి.శ్రీపాల్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

పంట మార్పిడితో ప్రయోజనాలు

నర్సింహులపేట, న్యూస్‌టుడే: పంట మార్పిడి చేసి ఆయిల్ పామ్ సాగు చేసి ఆదాయం పొందవచ్చని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమాధికారి మరియన్న అన్నారు. మండలం కేంద్రంలోని, లోక్యాతండా గ్రామ శివారు బంగారుతండా, నెల్లికుదురు మండలంలోని ఎర్రబెల్లిగూడెం, కాచికల్, మేజరాజుపల్లి, గ్రామాల్లోని రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై శుక్రవారం అవగాహన కల్పించారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న ఉద్యాన పంటలపై రైతులు ఆసక్తి చూపాలన్నారు. ఆయిల్‌పామ్ పంట సాగుతో అధిక దిగుబడులు వచ్చి ఆదాయం పొందవచ్చాన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

కేసముద్రం, న్యూస్‌టుడే: నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై మురళీధర్‌రాజు హెచ్చరించారు. మండల కేంద్రం, పెనుగొండ అడ్డరోడ్డు వద్ద శుక్రవారం ఎస్సై మురళీధర్ రాజు ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు.

ఆదివాసీ మహిళలతో పీవో మాటాముచ్చట..!

ఏజెన్సీ గ్రామాల్లోని ఆదివాసీ మహిళలతో ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా శుక్రవారం మాట్లాడి వారి సాధకబాధలు తెలుసుకున్నారు. మంత్రి సీతక్క కార్యక్రమం నేపథ్యంలో శుక్రవారం కొత్తగూడ మండలానికి పీవో వచ్చారు. మంత్రి రాక ఆలస్యం కావడంతో ఏజెన్సీ గ్రామమైన మోకాళ్లపల్లిలో ఆమె కొద్దిసేపు ఆదివాసీ మహిళలతో ముచ్చటించారు. ఓ ఇంటి వద్ద మహిళలు ఉండడంతో అక్కడికెళ్లిన పీవో వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. పంటల సాగు విషయాలను తెలుసుకున్నారు. వారితో మాట్లాడి జీవన విధానాన్ని తెలుసుకునేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆదివాసీ మహిళలు పీవో దృష్టికి తీసుకెళ్లారు. – న్యూస్‌టుడే, కొత్తగూడ



ప్రసవం చేసేందుకు నిరాకరణ..!

వర్ధన్నపేట: వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి పురిటి నొప్పులతో బాధపడుతూ అర్ధరాత్రి వచ్చిన ఓ గర్భిణికి ప్రసవం చేయలేమని వరంగల్‌కు పంపడంతో మార్గం మధ్యలో 108 వాహనంలో ప్రసవించిన ఘటన చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం తొర్రూరు మండలం అమ్మాపురం గ్రామానికి చెందిన కిన్నెర నాగమణి అనే గర్భిణికి నెలలు నిండడంతో గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత పురిటినొప్పులు వచ్చాయి. కుటుంబ సభ్యులు తొర్రూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా, అక్కడ వైద్య పరీక్షలు చేసిన సిబ్బంది ప్రసవం కోసం వర్ధన్నపేట ఏరియా ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు. దీంతో కుటుంబ సభ్యులు నాగమణిని వర్ధన్నపేట ఆసుపత్రికి అర్ధరాత్రి 1.35 గంటల ప్రాంతంలో తీసుకొచ్చారు. వెంటనే ప్రసవం చేయాలని వైద్య సిబ్బందిని కోరారు. పరీక్షించిన సిబ్బంది కడుపులోని బిడ్డ పరిస్థితిని బాగాలేదని వైద్యులు శస్త్రచికిత్స చేయడానికి వైద్యులు లేరని తెలిపినట్లు ఆరోపించారు. కనీసం 108 వాహనానికి తెలపాలని కోరినా తమకు సంబంధం లేనట్లు వ్యవహరించారన్నారు. అక్కడ ఉన్న ఇతరుల సాయంతో 108 వాహనంలో వరంగల్‌కు తరలిస్తుండగా పంథిని శివారులో ఆమెకు పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో 108 వాహన టెక్నీషియన్ సదానందం నాగమణికి సాధారణ ప్రసవం చేయడంతో మగబిడ్డ జన్మించింది. తల్లిని బిడ్డను సీకేఎం ఆసుపత్రికి తరలించినట్లు బాధితులు తెలిపారు. ఈ విషయంపై ఆసుపత్రి సూపరింటెండెంట్ రామ్మూర్తిని వివరణ కోరగా ఆసుపత్రిలో గురువారం రాత్రి ఇద్దరు వైద్యులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. పురిటి నొప్పులతో వచ్చిన నాగమణి కుటుంబ సభ్యులు ప్రసవం ముందు ఇచ్చే అనుమతి పత్రాలపై సంతకాలు చేయలేదని, అదే సమయంలో కడుపులో ఉమ్మనీరు తక్కువ ఉన్నట్లు సిబ్బంది గుర్తించారని తెలిపారు. ఘటనపై విచారణ చేస్తామన్నారు.